క్లుప్తంగా

చర్చి నిర్మాణానికి రూ.50 వేలు వితరణ



వితరణ అందిస్తున్న హరిప్రసాద్

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక, రేగులచలక గ్రామాల పరిధిలో నిర్మాణం చేయబోతున్న నూతన చర్చి నిర్మాణానికి కోయచలక సర్పంచ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మాధంశెట్టి హరిప్రసాద్ రూ.50 వేలు వితరణగా శుక్రవారం సంఘం పెద్దలకు అందించారు. ఈక్రమంలో త్వరలో నిర్మాణం చేపట్టబోయే పునీత జోజప్ప నూతన దేవాలయం కోసం వితరణలు సేకరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జాతీయ ఫొటోగ్రఫీలో బహుమతి



బహుమతి అందుకుంటున్న మోహినుద్దిన్

తిరుమలాయపాలెం: వనపర్తి ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో మండలంలోని గోల్‌తండాకు చెందిన షేక్ మోహినుద్దిన్ ప్రథమ బహుమతి సాధించాడు. కోయ డ్యాన్స్, మత్స్యకారుల జీవన శైలిపై నిర్వహించిన ఈ పోటీల్లో కనబరిచిన ప్రతిభకు ఈ బహుమతి దక్కింది. ఈ సందర్భంగా మోహినుద్దిన్‌ను గ్రామస్తులు, ఫొటోగ్రాఫర్లు అభినందించారు.

కాల్వ పనులు అడ్డగింత

నేలకొండపల్లి: గ్రామానికి వరద ముప్పు ఎదురుకాకుండా నీటి మళ్లింపునకు చేపట్టిన కాల్వ పనులను ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో ప్రధాన రహదారి వెంట డ్రెయిన్లు లేకపోవడంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోకి వరద నీరు ముంచెత్తుతోంది. దీంతో వరద నీటిని మళ్లించేందుకు కాల్వ నిర్మాణానికి సర్పంచ్ దండా పుల్లయ్య విజ్ఞప్తితో జెడ్పీ నుంచి రూ.5లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులను శుక్రవారం చేపట్టగా ఇరిగేషన్ మానిటరింగ్ అధికారులు అడ్డుకున్నారు. వరద నీరు కాల్వలోకి రావడానికి వీల్లేదని, శాశ్వత డ్రెయినేజీ నిర్మించొద్దని సూచించడమే కాక గతంలో కాల్వ వేసిన పైపులైన్లను తొలగించాలని సూచించారు. ఈ విషయమై సర్పంచ్ దండా పుల్లయ్య మాట్లాడుతూ తమకు నోటీసు అందాకే స్పందిస్తామని పేర్కొన్నారు. అలాగే, ఇరిగేషన్ మానిటరింగ్ డీఈఈ మధు మాట్లాడుతూ మురుగునీరు కాల్వలోకి వదలొద్దని చెబుతూ, యూటీ ద్వారా మళ్లింపు పనులు చేసుకోవాలని సూచించినట్లు తెలిపారు.

గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా గన్యానాయక్

కూసుమంచి: తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండలానికి చెందిన మూడ్ గన్యానాయక్ నియమితులయ్యారు. మిర్యాలగూడెంలో జరిగిన మూడో రాష్ట్ర మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకోగా గన్యానాయక్‌కు రాష్ట్ర కమిటీలో చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు సీపీఎం, గిరిజన సంఘం నాయకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జర్నలిస్టు ఎల్.ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పిండిప్రోలుకు చెందిన ప్రవీణ్ ఖమ్మం వెళ్లి గురువారం రాత్రి మోటార్‌సైకిల్‌పై వస్తుండగా తిరుమలాయపాలెం చర్చి సమీపాన కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.

రోటావేటర్ చోరీ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెంలో రైతు రైతు మేకల పుల్లయ్యకు చెందిన రోటావేటర్ చోరీకి గురైంది. సదరు రైతు తన పొలం వద్ద రూ.1.10లక్షల విలువైన రోటావేటర్ ఉంచగా, గత నెల 18న గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అప్పటి నుంచి గాలిస్తుండగా ఆచూకీ లేకపోవడంతో ఆయన చేసిన ఫిర్యాదు మేరకు నేలకొండపల్లి పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు...

కామేపల్లి (కారేపల్లి) : బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం తాళ్లగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన రెడ్డెబోయిన శ్రీను, లక్ష్మి దంపతులు బైక్‌పై ఖమ్మం నుంచి వస్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో శ్రీను కాలికి తీవ్రగాయం కాగా, లక్ష్మికి స్వల్పగాయమైంది. వీరిని ఖమ్మం ఆస్పత్రికి తరలించగా.. కామేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్‌దే పెత్తనం..

- ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిపై ఆజమాయిషీ
- పర్మనెంట్ ఉద్యోగులను కాదని డీబీలో కీలక బాధ్యతలు
- అవసరాల కోసం సెక్షన్‌ను గాలికొదిలేసిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏ అభివృద్ధి పని జరిగినా పర్యవేక్షణ, ఇతరత్రా బాధ్యతలు నిర్వర్తించడంలో ఇంజనీరింగ్ విభాగమే కీలకం. ఫీల్డ్‌లో వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పాటు ఇంజనీరింగ్ అధికారులు, కార్యాలయంలో డ్రాయింగ్ బ్రాంచ్(డీబీ) అధికారులు, సిబ్బంది అభివృద్ధి పనుల ప్రారంభం నుండి బిల్లులు చెల్లింపు వరకు కీలకంగా వ్యవహరిస్తుంటారు. టెండర్ల ప్రక్రియ, పనుల కేటాయింపు, ఎంబీలు రాయడం, బిల్లులు తయారు చేయడం, ఆపై అకౌంట్స్ విభాగానికి పంపించడం వంటివి ఇంజనీరింగ్ విభాగం, డ్రాయింగ్ బ్రాంచ్ ఆధ్వర్యాన కొనసాగుతాయి. ఇంతటి కీలకమైన విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెత్తనం పెరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి సహచర సిబ్బందితో పాటు, కొందరు రెగ్యులర్ ఉద్యోగులపై పెత్తనం చెలాయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రతీ డివిజన్‌లో తనదే పెత్తనం అన్న చందంగా ఆ ఉద్యోగి వ్యవహరిస్తుండడంతో ఇంజనీరింగ్ అధికారులు, రెగ్యులర్ ఉద్యోగుల్లో గుబులు రేపుతుంది. ఒకరిద్దరు ఇంజనీరింగ్ అధికారులు తమ పబ్బం గడుపుకునేందుకు ఆ ఉద్యోగికి పెత్తనం అప్పగించడంతో ఆయన తన రాజకీయ పలుకుబడితో అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ ఉద్యోగులను కాదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగికి కీలక బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది.



డివిజన్లలోనూ పెత్తనం..

నగరంలోని డివిజన్లలో స్థాయిలో జరిగే అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వర్క్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలి. పనుల్లో నాణ్యత, కొలతలు పాటించేలా చూడాలి. కానీ ఆరోపణలు ఎదుర్కొంటున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ ఒకరిద్దరు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఓ డివిజన్‌లో ఇటీవల రోడ్డును నిబంధనల ప్రకారం కాకుండా సగం మేర మాత్రం చేయడంపై వెనుక ఈ ఉద్యోగి పాత్ర ఉందని తెలుస్తోంది.

చూసీచూడనట్లు..

కేఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో 12 మంది వర్క్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వర్తిస్తుండగా.. ఏళ్లుగా పనిచేస్తున్న సదరు ఉద్యోగికి రాజకీయ అండ ఉండటమే పెత్తనానికి కారణమని తెలుస్తోంది. రాజకీయ అండ, అధికారుల మద్దతుతో సదరు ఉద్యోగి ఇతర ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై ఆజమాయిషీ చెలాయిస్తుండడం గమనార్హం. ఇక ఇంజనీరింగ్ విభాగంలోని కొందరు అధికారులు తమ పర్సంటేజీల వ్యవహారాలను ఈ ఉద్యోగి ద్వారా చక్కబెట్టుకుంటున్నట్లు సమాచారం. డివిజన్లలో చేపట్టే పనుల్లో నాణ్యత లేకున్నా అధికారులు, కాంట్రాక్టర్లకు మధ్య సెటిల్‌మెంట్ విషయంలో ఈ ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తుండడంతోనే ఇంజనీర్లు సైతం మద్దతు పలుకుతున్నట్లు తెలుస్తోంది.

ఫిర్యాదులు అందితే చర్యలు

డ్రాయింగ్ బ్రాంచ్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పెత్తనం చెలాయిస్తున్నట్లు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. అయినప్పటికీ ఈ విషయంపై ఆరా తీస్తాం. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే వెంటనే విచారించి చర్యలు తీసుకుంటాం.

– కృష్ణలాల్, ఈఈ, కేఎంసీ

నానో యూరియాపై అవగాహన అవసరం

నేలకొండపల్లి/ తిరుమలాయపాలెం: నానో యూరియా వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఏడీఏ ఎస్.విజయచంద్ర, తిరుమలాయపాలెం మండల వ్యవసాయధికారి నారెడ్డి సీతారాంరెడ్డిలు సూచించారు. శుక్రవారం నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డిపాలెంలో ఏడీఏ విజయచంద్ర, తిరుమలాయపాలెంలోని పాతర్లపాడులో సీతారాంరెడ్డిలు క్షేత్రస్థాయిలో వినియోగం, వాటి ప్రయోజనాలపై రైతులకు వివరించారు. భారత ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ భారాన్ని తగ్గించేందుకు ఇఫ్‌కో కంపెనీ ద్వారా నానో బయోటెక్నాలజీ రీసెర్చ్ సెంటర్ ద్వారా యూరియాను ద్రవరూపంలో వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. నానో యూరియాను ఎకరాకు 500 ఎంఎల్ చొప్పున పొలం వేసిన 20–25 రోజులు, చిరుపొట్ట దశలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి కందుల అరుణ, ఏఈఓలు ఎం.దుర్గాభవాని, నవనీత, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: సింగారెడ్డిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ విజయచంద్ర

నిర్మాణాలకు మించి పన్ను కట్టాలని ఒత్తిడి

ఖమ్మం మామిళ్లగూడెం: కళాశాల భవనాన్ని పునర్నించాక అందుకు అనుగుణంగా పన్ను విధించాలని ఖమ్మం రూరల్ మండలం బారుగూడెంలోని మహ్మదీయ కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ మణిబాబు, ఫ్యాకల్టీ సుధాకర్ కోరారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. తొలుత తాము జీ ప్లస్ ఫోర్ భవనానికి అనుమతి తీసుకున్నా, ఒక భవనం జీ ప్లస్ టూగా, మిగిలినవి జీ ప్లస్ వన్‌గానే నిర్మించామని తెలిపారు. అయినా పంచాయతీ బాధ్యులు జీ ప్లస్ ఫోర్ లెక్కన పన్ను కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. మూడు రోజులుగా ఉపాధ్యాయులు, విద్యార్థులను అడ్డుకుంటున్నందున తమకు న్యాయం చేయాలని కోరారు.

ఘనంగా 'మహిళావరణం'

ఖమ్మం సహకారనగర్: స్త్రీ సాధికారతే ధ్యేయంగా మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా అన్నారు. శుక్రవారం కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళావరణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల వస్తువులు, వంటకాలు, మెహందీ, బ్యూటీపార్లర్, హెర్బల్ ప్రోడక్ట్ తదితర వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ జె.అనురాధ, వివిధ విభాగాల బాధ్యులు, అధ్యాపకులు రమా సత్యవతి, బీవీ రెడ్డి, జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలో శుక్రవారం నిర్వహించిన ఖమ్మం ప్రైవేట్ అంబులెన్స్ యూనియన్ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చింతల వినయ్, ఉపాధ్యక్షుడిగా పాలిశెట్టి ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా చింతల రవి, జాయింట్ సెక్రటరీగా చాట్ల రాజేష్, కోశాధికారిగా మందపల్లి రాములను ఎన్నుకున్నారు.

సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఎస్టీడీడీ పి.కృష్ణనాయక్ అన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్నెస్పీ క్యాంపులో ఉన్న గిరిజన కళాశాల బాలికల వసతిగృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వసతిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారిణి సీహెచ్.నాగమణి, నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ

నేలకొండపల్లి: మండల పరిధిలోని కోనాయిగూడెంలో శుక్రవారం జీవాలకు ఉచిత నట్టల నివారణ మందులను ఎంపీపీ వజ్జా రమ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా జీవాలకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. నట్టల నివారణ వలన జీవాల్లో ఎదుగుదల ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ, మండల పశు వైద్యాధికారి టి.సంజయ్‌రెడ్డి, గ్రామ దీపిక కొమ్మినేని పుష్పావతి, సమాఖ్య అధ్యక్షురాలు కుమ్మరి నాగమణి, రైతులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఖమ్మంరూరల్: మండలంలోని ఎంవెంకటాయపాలెం పీహెచ్‌సీ అభివృద్ధి కోసం సహకారం అందించాలని కోరుతూ శుక్రవారం సాయిగణేష్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి గ్రామ సర్పంచ్ మండడి సంధ్యారాణి వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే రూ3.50 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి.ఉపేందర్, ఆర్.వెంకన్న, కొట్టె వెంకట్రావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

రఘునాథపాలెం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి కొన్ని నెలలుగా రావాల్సిన పెండింగ్ వేతనాల కోసం ఏఐటీయూసీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రామకృష్ణకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, ఏఐటీయూసీ మున్సిపల్ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుగులోతు రాందాస్, ఎం.రాజగోపాల్, బి.మంగీలాల్, కె.ప్రవీణ్, వెంకన్న, జి.విజయ్, జి.నారాయణ, ఉపేందర్, రామకృష్ణ, ఎ.సైదులు, లాలు, కోటేశ్వరరావు, రాజు, వీరన్న, లింగయ్య, శివలాల్, వెంకటేష్, బీమా, బి.వెంకన్న, సీహెచ్.సైదులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. వీవీపాలెం, ఇండస్ట్రియల్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు లైన్ పరిధిలోని జీఆర్ఆర్ శ్రీనివాస్‌కాలనీ, వెంకటాద్రి హిల్స్, వెలుగుమట్ల పార్కు, మ్యాక్స్ కాలేజీ ప్రాంతాల్లో అంతరాయం కలుగుతుందని చెప్పారు.

రేపు సప్తకళల సమ్మేళనం

ఖమ్మంగాంధీచౌక్: ఫైర్ ప్రార్థవిక, పండు ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం ఖమ్మంలో సప్తకళల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ నాగబత్తిని రవి తెలిపారు. పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమ్మేళనంలో భాగంగా వివిధ రంగాల కళాకారులతో ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో వ్యాఖ్యాత జి.రవీంద్ర, సినీ ఉద్యమ గేయరచయిత యశ్‌పాల్, మెజిషియన్ రామడుగు వసంత, రచయిత కొత్తపల్లి శేషు, కమెడియన్ మొగిలి గుణకర్‌ను సన్మానించనున్నట్లు తెలిపారు. ఆదివారం సాయంత్రం 5:30 గంటలకు ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో మొదలయ్యే సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేల్పుల విజేత, అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏ.ఎస్.కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్ల కేంద్రం ప్రారంభం



పన్ను చెల్లిస్తున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 51వ డివిజన్‌లోని అభయ ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద కేఎంసీ ఆధ్వర్యాన పన్నుల వసూళ్ల ప్రత్యేక కేంద్రాన్ని శుక్రవారం స్థానిక కార్పొరేటర్ శీలంశెట్టి రమావీరభద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేఎంసీ ఆదాయం పెంచుకునేందుకు అధికారులు ప్రతి ఏడాది ఆలయం వద్ద పన్నుల వసూళ్లకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేసివసూలు చేస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు పన్నుల చెల్లింపుల్లో ఏదైన సమస్య తలెత్తినా అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవచ్చు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ శీలంశెట్టి వీరభద్రం, స్థానికులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో జనరేటర్...

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి జోయాలుకాస్ ఫౌండేషన్ అందించిన జనరేటర్‌ను శుక్రవారం రీజనల్ మేనేజర్ రాబిన్ తంబి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వజ్జా రమ్య, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ మణికంఠ, వైద్యాధికారి కె.రాజేష్, శ్రావణ్‌కుమార్, ఎస్సై ప్రవంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

ఖమ్మంగాంధీచౌక్: విద్యార్థులకు, పాఠకులకు ప్రయోజనం కలిగేలా జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం గ్రంథాలయ అధికారులు, ఉద్యోగులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సహకారంతో పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులకు అనుగుణంగా నూతన నిర్మాణాలను చేస్తున్నామన్నారు. సత్తుపల్లిలో గ్రంథాలయ నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు పార్థసారథి రెడ్డి ఆర్థిక సాయమందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ లైబ్రరీ ఫోరమ్ టేబుల్ క్యాలెండర్లను ఆయర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ ఫోరమ్ అధ్యక్షుడు కేఎల్ఎన్ రాజు, ప్రతినిధులు ఇమామ్, భాస్కర్‌రావు, అఖిల్, జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి అర్జున్, టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, నందగిరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు

ఘనంగా వన్యప్రాణుల దినోత్సవం



వివిధ వేషధారణలతో ఉన్న చిన్నారులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్/తిరుమలాయపాలెం: నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో ప్రపంచ వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్‌రావు, కొండా కృష్ణవేణిలు మాట్లాడుతూ.. వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. చిన్నారుల వేషధారణాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నరావు, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలంలోని జల్లెపల్లి జెడ్పీ పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కూసుమంచి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ పి.సురేష్‌కుమార్ సెక్షన్ ఆఫీసర్ డానియల్, బీట్ ఆఫీసర్ హరికృష్ణ, మధు, నంద్యాల శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: టీజేఎస్ పార్టీ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆధ్వర్యాన 10వ తేదీన హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో గల వీఎస్‌టీ హాల్లో నిర్వహించే తెలంగాణ బచావో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు మాట్లాడుతూ.. ఈ సదస్సుకు తెలంగాణ ఉద్యమకారులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జంగిపల్లి రవి, రవీందర్, షేక్ సర్దార్, ఖాసీం, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలంలో ఇల్లెందు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా కొమ్మినేపల్లిలో జరిగిన శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవానికి హాజరుకావడంతో పాటు తాళ్లగూడెంలో జరిగిన శ్రీ లక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి దేవస్థానం ప్రతిష్ఠాపనలోనూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, అర్చకులు రామలింగేశ్వరశర్మతో పాటు అంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

ఖమ్మంమామిళ్లగూడెం: మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారకులైన సైఫ్‌ను ఉరితీయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రప్రదీప్ పాల్గొని మాట్లాడుతూ.. కాలేజీ యాజమాన్యంపై సిట్టింగ్ జడ్జి ద్వారా న్యాయ విచారణ జరిపి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గెంటల విద్యాసాగర్, దొడ్డ అరుణ, శ్యామ్ రాథోడ్, నున్న రవి, అత్తి విజయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్, కల్యాణం వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఖమ్మం సిటీ బస్టాండ్ ఎదుట మానవహారం నిర్వహించారు. తొలుత జెడ్పీ నుంచి ర్యాలీగా బయలుదేరి, వైరా రోడ్డు మీదుగా ఖమ్మం సిటీ బస్టాండ్ వరకు సాగింది. అనంతరం వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమ్య, సుధారాధ, పాపారాణి, రత్నకుమారి, ఉదయశ్రీ, వీరన్న, మల్లికార్జున్, పవన్, సీఐటీయూ జిల్లా నాయకులు సీహెచ్.విఠల్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమన్వయ సమితి కన్వీనర్ పదవికి రాజీనామా

తిరుమలాయపాలెం: రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ చావా శివరామకృష్ణ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి నడవాలని నిర్ణయించుకున్నందున పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఇన్నాళ్లు తనకు అవకాశాలు కల్పించిన పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈనెల 5న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన జరగనున్న పాలేరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శివరామకృష్ణ కోరారు. ఈసమావేశంలో నాయకులు మద్ది కిషోర్‌రెడ్డి, అజ్మీరా అశోక్‌నాయక్, వెంకటేశ్వరరావు, దొడ్డి సాంబయ్య, సైదా, కొమ్ము వీరబాబు, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సార్ సినిమా చూపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: సార్ సినిమాను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు థియేటర్లలో ఉచితంగా సినిమా చూపించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సార్ సినిమాను విద్యార్థులకు ఉచితంగా చూపించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిగృహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటైజేషన్ పేరుతో విద్యా వ్యవస్థ వ్యాపారంగా ఎలా మారిందో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఎలా చదువుకోవాలనేది కళ్లకు కట్టినట్లుగా ఈ సినిమాలో చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు వినయ్, రవి, రాకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్' విధానాలతోనే విద్యార్థుల బలవన్మరణాలు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యార్థుల ప్రాణాలు బలితీసుకున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉపేందర్, మస్తాన్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఉమెన్స్ కళాశాల నుంచి ప్రధాన గేటు వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు వారు మాట్లాడుతూ.. ప్రైవేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపించి నష్టపరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో నాగేశ్వరి, అఖిల, జ్యోతి, మౌనిక, శ్రావ్య, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'బండ' బాదుడుపై రోడ్డెక్కిన నాయకులు

కేంద్రప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం పలు మండలాల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకులు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేసి ప్రధాని మోదీ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



కూసుమంచి: మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎన్డీ నేతలు



ఖమ్మంరూరల్: నాయుడుపేట సెంటర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కామేపల్లిలోని ముచ్చర్లలో.. ఎన్డీ నాయకుల ఆందోళన